క్లుప్తంగా

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలి

● ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: తగాదాలు పడకుండా ప్రశాంత వాతావరణంలో భోగి, సంక్రాంతి, కనుమ పండగలు జరుపుకోవాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన అధికారులు, పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. జూదం, గుండాట, కోడిపందాలు వంటివి నిర్వహించవద్దన్నారు. ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు అని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం సిటీ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కొతారిపురం గ్రామంలో చెత్త బుట్టల పంపిణీ చేశారు. ప్రతీ ఇంటి నుంచి చెత్త ఈ బుట్టల ద్వారా గ్రీన్ అంబాసిడర్‌లకు అందించాలని, బయట పారవేయవద్దన్నారు. ఎవరికి వారు తమ రోడ్లు, వీధులు, వార్డులు శుభ్రంగా ఉండేలా చూసుకుంటే పట్టణం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కెట్ కిటకిట



జనాలతో కిటకిటలాడుతున్న మాధవ బజార్

రాజాం: సంక్రాంతి పండగ నేపథ్యంలో పట్టణంలోని మార్కెట్ శుక్రవారం కొనుగోలుదారులతో కిటకిటలాడింది. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పలు రకాల వస్తుసామగ్రి కొనుగోలుకు వస్త్ర దుకాణాలు, కిరాణా షాపులు, కూరగాయల దుకాణాల వద్ద కొలువుదీరడంతో మార్కెట్ కిక్కిరిసినట్లు కనిపించింది.

శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఈశ్వరరావు

రాజాం సిటీ: సంతకవిటి మండలంలోని తలతంపర గ్రామానికి చెందిన రాజాం రచయితల వేదిక సభ్యుడు పోలాకి ఈశ్వరరావు శ్రీశ్రీ కళావేదిక యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక కొత్త కమిటీ వివరాలు శుక్రవారం వెల్లడించినట్లు ఆయన తెలిపారు. తనను విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేస్తూ శ్రీశ్రీ కళావేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమనాయుడు తెలిపారన్నారు. ఈ నేపథ్యంలో ఈశ్వరరావును రారవే నిర్వాహకులు గార రంగనాథంతో పాటు పలువురు అభినందించారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుని, కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ తిరుపతి

సంతకవిటి: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని సర్పంచ్ డోల తిరుపతి అన్నారు. ఎర్నేన అప్పలనాయుడు జ్ఞాపకార్థం మండలంలోని సిరిపురం గ్రామంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులంతా క్రీడాస్ఫూర్తి కనబరచాలన్నారు. కార్యక్రమంలో ఎర్నేన అప్పలనాయుడు, పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేకాట, కోడిపందాలు ఆడొద్దు



ఎస్‌ఐ జయంతి

బాడంగి: పేకాట, కోడిపందాలు ఆడకూడదని ఎస్‌ఐ ఆర్.జయంతి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆమె ప్రశాంత వాతావరణంలో సంక్రాంతి పండగ జరుపుకోవాలని తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, తగాదా, కొట్లాటకు దిగడం వంటివి చేయకూడదన్నారు. పండగ మూడు రోజుల్లో రాత్రిపూట గస్తీ, బీట్‌లు పెంచుతామన్నారు.

పల్లెకు సంక్రాంతి కళ

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని ప్రతీ గ్రామంలో సంక్రాంతి కళ ఉట్టిపడుతోంది. జీవనోపాధి కోసం స్వగ్రామం విడిచి, సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా కన్నఊరికి చేరుకున్నారు. ప్రధాన వీధులు, రోడ్లు, ఇళ్ల ఆవరణలు రకరకాల రంగవల్లులతో అందంగా కనిపిస్తున్నాయి. డూడూబసవన్న, హరిదాసులు సంచరిస్తూ తెలుగు సంప్రదాయ పండగను గుర్తు చేస్తున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ సంప్రదాయ వస్త్రధారణలో మెరిసి, పల్లెలకు పండగ వాతావరణం తీసుకువచ్చారు. కొన్నిచోట్ల సంక్రాంతి ముందస్తు సంబరాలు ఘనంగా నిర్వహిస్తుండడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: కూనాయవలసలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ, సూపర్‌వైజర్, కార్యకర్తలు



రామభద్రపురం: ఇంటి ముంగిట సంక్రాంతి ముగ్గులు వేస్తున్న మహిళలు



రామభద్రపురం: చొక్కాపు వీధిలో డూడూబసవన్న విన్యాసాలను ఆసక్తిగా తిలకిస్తున్న చిన్నారులు



రాజాం: కుమ్మరివీధిలో సంచరిస్తున్న హరిదాసు



రేగిడి: సంక్రాంతికి కుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు



రాజాం సిటీ: భోగి పండగకు కలప సేకరించిన రాజాం పట్టణవాసులు



బొబ్బిలి రూరల్: నారాయప్పవలస పాఠశాలలో భోగిమంట వేసిన దృశ్యం



రేగిడి: దేవుడికి నైవేద్యంగా సమర్పించేందుకు తయారు చేసిన అప్పాలు



బొబ్బిలి రూరల్: అలజంగిలో గాలిపటాలతో చిన్నారుల సందడి

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రాజాం: ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులకు శానిటరీ కిట్లు, కొత్త దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్టణంలోని పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం పట్టణ ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు కృషిచేస్తున్నారని తెలిపారు. వీరి ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇందులో భాగంగానే ఈ కిట్లు, సబ్బులు, శానిటరీ కిట్లు అందజేస్తున్నామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా మార్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజాం రహదారి విస్తరణతో పాటు మధ్యలో వీధి దీపాల ఏర్పాటు, ప్రతీ వార్డులో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, నాయకులు పి.లక్ష్మణరావు, ఎస్.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులకు శానిటరీ కిట్లు, దుస్తులు అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

వలంటీర్లకు నియామకపత్రాలు అందజేత



వలంటీర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ వలంటీర్లకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కొత్తగా ఎంపికైన వలంటీర్లకు నియామకపత్రాలు శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో పాటు అధికారులు చెప్పిన పనులను చేయాలన్నారు. క్లస్టర్ పరిధిలోని కుటుంబాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు అందించాలని కోరారు.

బైక్ అపహరణపై కేసు నమోదు

రాజాం సిటీ: సంతకవిటి మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన దువ్వ నాగరామారావు బైక్ అపహరణపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వీబీ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 11వ తేదీన రాజాం వచ్చిన ఆయన ఎస్‌వీజీ ఫర్నిచర్ వద్ద బైక్ పార్కింగ్ చేసి, లోపలికి వెళ్లి వచ్చేసరికి వాహనం కనిపించలేదు. ఈ నెల 12వ తేదీ వరకు బైక్ కోసం వెతికినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లింగాకర్షక బుట్టలతో ‘అపరాలు’కు మేలు



మాట్లాడుతున్న ఏడీఓ శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: లింగాకర్షక బుట్టలతో అపరాల పంటలకు మేలు కలుగుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.శ్యామ్‌సుందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని అలజంగి గ్రామంలో అపరాల పంటలో వచ్చే తెగుళ్లు, వాటి సంరక్షణపై వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన అపరాల పంటలకు సోకిన ఆకుముడత, పల్లాకుతెగులును గుర్తించారు. అపరాలు సాగు చేసే పొలాల్లో బాక్స్ టైప్ జిగురు పళ్లెం, లింగాకర్షక బుట్టలను పొలంలో ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇలా ఏర్పాటు చేయడం వల్ల తెల్లదోమ, శనగపచ్చ పోడి ఉధృతిని తెలుసుకోవచ్చన్నారు.

అపరాల పంటలలో బూడిదతెగులు రాకుండా సాఫ్ అనే మందును ఎకరానికి 250 గ్రాములు వేయాలని, తెల్లదోమ నివారణకు ఇమిడాక్లోరిపిడ్ మందు ఎకరానికి 80 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే లద్దెపురుగు నివారణకు ఇమిడా క్లోరిపిడ్ మందు ఎకరానికి 80 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు. పొగాకు లద్దెపురుగు నివారణకు ఎసిపేట్ అనే పొడర్‌ను ఎకరానికి 300 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ అనే మందును ఎకరానికి 80 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు.

ప్రభుత్వం రైతు పక్షపాతి

మెంటాడ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, రైతుల శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశానికి హాజరైన ఆయన రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. ఇప్పటికే సివిల్ సప్లయి అధికారులతో పాటు రైతులందరి సహకారంతో 16 వేల టన్నుల ధాన్యం సేకరించి, విక్రయించగలిగామన్నారు. వ్యవసాయశాఖాధికారి గోకుల్‌కృష్ణ మాట్లాడుతూ మండలంలో పీఎం కిసాన్, ఈకేవైసీ, రబీ ఈ–క్రాప్ పంట నమోదుతో పాటు, తృణధాన్యాల అభివృద్ధి పథకంపై అవగాహన కల్పించారు. నీటిపారుదల శాఖ ఏఈ రూప మాట్లాడుతూ ఆండ్ర జలాశయం కింద మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని, రెండో పంటకు నీరు ఇవ్వలేమని ఈ విషయాన్ని రైతులు గ్రహించగలరన్నారు. కార్యక్రమంలో సలహా సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి అప్పలనాయుడు, తహసీల్దార్ ఉత్తరావల్లి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సన్యాసినాయుడు

సీఎం జగన్ వెంటే జనం

● ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్ర జనం ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు ప్రజలు తహతహలాడుతున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన రణస్థలంలో ఇటీవల జరిగిన పవన్ బహిరంగ సభనుద్దేశించి కాసేపు మాట్లాడారు. ఇన్నాళ్లకు పవన్ ఓ నిజం మాట్లాడారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే జనం ఉన్నారని పరోక్షంగా ఆయన ఒప్పుకున్నారన్నారు. తన సభలకు జనం వస్తున్నారు కానీ వచ్చిన వారంతా ఓట్లు వేయడం లేదన్న పవన్ కల్యాణ్ మాటలను ఆయన గుర్తు చేశారు. పవన్‌కు, ఆయన మాటలకు స్థిరత్వం లేదన్నారు. రోజుకో పార్టీతో ఉంటారని, పూటకో మాట మాట్లాడుతారని విమర్శించారు. ఆయన ఓ సినీ నటుడు కావడంతోనే అతడిని చూసేందుకు యువత వస్తున్నారన్నారు. ఎప్పుడూ వేరొకరి రాజకీయ లబ్ధి కోసం పనిచేస్తానంటే ప్రజలు కూడా హర్షించరన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రశంసించకుండా గతంలో తిట్టిన టీడీపీ వెంటే నడుస్తానని, మద్దతు ఇస్తానని ఆయన మాట్లాడడం ఆ పార్టీ నేతలు, కార్యకర్తకు మింగుడు పడడం లేదని విమర్శించారు. రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాల్లో 175 స్థానాలను వైఎస్సార్ సీపీ గెలుస్తుందని జోష్యం చెప్పారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ సీహెచ్ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్‌ఐ సురేంద్రనాయుడు

రామభద్రపురం: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలని ఎస్‌ఐ సురేంద్రనాయుడు అన్నారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక జాతీయ రహదారిలో వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అన్నిటి కన్నా మన ప్రాణం విలువైనదని, దాన్ని మనకు మనమే కాపాడుకోవాలని ఎస్‌ఐ సూచించారు. అందరూ బాధ్యతగా మెలిగితే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమన్నారు. చిన్నచిన్న నిబంధనలు పాటించకపోవడంతో పెద్దపెద్ద ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు.

వాటర్ వరల్డ్ ప్రారంభం



జెండా ఊపి, వాటర్ వరల్డ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం సిటీ: పట్టణానికి దగ్గరలోని తృప్తి రిసార్ట్ వద్ద వాటర్ వరల్డ్‌ను ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలిసి శుక్రవారం ప్రారంభించారు. క్రమక్రమంగా అభివృద్ధి చెందుతున్న రాజాం పట్టణంలో వినూత్న, వినోద, ఆహ్లాదకరమైన వ్యాపారాలు ఆరంభమవుతుండడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, పి.లక్ష్మణరావు, సీఐలు రవికుమార్, ఉపేంద్ర, సంతకవిటి ఎస్‌ఐ జనార్ధనరావు, రిసార్ట్ డైరెక్టర్ పీవీజీ కృష్ణం మాస్టారు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ



రేగిడి: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు

రేగిడి: మండలంలోని వన్నలి, ఖండ్యాం, కొండగూడెం గ్రామాల్లోని నిరుపేదలకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఏటా రాజాం జీఎంఆర్ ఐటీ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించే వారు. కోవిడ్ నేపథ్యంలో గత రెండేళ్లుగా సూపర్‌వైజర్ల ద్వారా గ్రామాల్లోని పేదలకు చీరలు, పంచెలు అందజేస్తుండడం గమనార్హం. కార్యక్రమంలో సర్పంచ్ జి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని కొండగూడేం గ్రామంలో పేదలకు శుక్రవారం కొత్త దుస్తుల పంపిణీ చేశారు. జీఎంఆర్‌వీఎఫ్ ఆధ్వర్యంలో సర్పంచ్ కె.వెంకటప్పలనాయుడు చేతులమీదుగా అనాథలు, వృద్ధులు, పేదలకు చీరలు, పంచెలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని కూనాయవలస గ్రామంలోని నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులకు జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

భోగి పిడకల స్టాల్ ఏర్పాటు



భోగి దండలు విక్రయిస్తున్న మహిళలు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద రాజాం వైఎస్సార్ క్రాంతి పథం రైతు ఉత్పత్తి సంఘాల మహిళలు శుక్రవారం స్టాల్ ఏర్పాటు చేశారు. భోగి పిడకల దండలు, నలుగుపిండి, నువ్వుల నూనె, చెరకు ముక్కలు వంటివి విక్రయించారు. కార్యక్రమంలో ఏపీఎంలు దధికుమార్, హేమలత, అప్పలనాయుడు, మండల సమాఖ్య అధ్యక్షులు అరుణకుమారి, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

భోగి పండగకు ఆ గ్రామాలు దూరం




రాజాం: అంతకాపల్లి గ్రామంలో కనిపించని భోగి పండగ సందడి



రాజాం: భోగి పండగ జరుపుకోని శ్రీహరినాయుడుపేట

రాజాం: తెలుగు ప్రజల అతిపెద్ద పండగ సంక్రాంతి. ఈ పండగలో భోగి పండగకు ఎంతో విశిష్టత ఉంది. ప్రతీ ఊరిలో పెద్దపెద్ద భోగి మంటలు వేసి, పిడకలు వేస్తారు. మహిళలు అయితే భోగి మంటలపై బిందెలతో నీటిని కాచి, దాంతో తలంటు స్నానం చేస్తారు. ఎంతో ఆహ్లాదకరమైన ఈ పండగను కొన్ని గ్రామాల ప్రజలు జరుపుకోరంటే ఇప్పటికీ ఆశ్చర్యమే. వివరాలిలా ఉన్నాయి.. రాజాం మండలంలోని అంతకాపల్లి, సంతకవిటి మండలంలోని శ్రీహరినాయుడుపేట, కాకరాపల్లి గ్రామస్తులు కొన్ని దశాబ్దాల పాటు భోగి పండగకు దూరంగా ఉంటున్నారు. గతంలో ఆయా గ్రామాల్లో వేసిన భోగి మంటల్లో పిల్లలు వంటి కొన్ని మూగజీవాలు మంటల్లో పడి ప్రాణాలు కోల్పోవడంతో అపశకునంగా భావించి అప్పటి నుంచి పండగ చేసుకోవడం మానేశారని అంతా చెబుతున్నారు. అయితే ఎంతో ఇష్టమైన భోగి పండగ ఆనందం ఆస్వాదించేందుకు పొరుగు గ్రామాలకు వెళ్లి, భోగి మంట కాగుతామని గ్రామస్తులు చెబుతున్నారు.



తెర్లాం: భోగి పండగ జరుపుకోని తమ్మయ్యవలస గ్రామం

తెర్లాం: కొన్ని దశాబ్దాలుగా మండలంలోని తమ్మయ్యవలస, కుమ్మరిపేట, పాములవలస గ్రామాల్లో భోగి పండగ జరుపుకోవడం లేదు. భోగి మంట వేస్తే గ్రామంలో అరిష్టం జరుగుతుందేమోనన్న భయంతోనే ఆయా గ్రామాల ప్రజలంతా పండగకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం.